www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 1 ఆగస్టు 2023

5

వరదలతో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి-రాజానగరం

ఉమ్మడి గోదావరి జిల్లాలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశామని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి తెలిపారు. సోమవారం యూనివర్సిటీలో దీనికి సంబంధించిన సర్క్యులర్‌ను ఆయన విడుదల చేశారు. వరద ప్రభావిత ప్రాంతాలను వినతుల మేరకు విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె.పద్మరాజు ఆదేశాలతో పరీక్షలను వాయిదా వేశామన్నారు. ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు ఒకటో తేదీ నుంచి జరగాల్సి ఉండగా, వాటిని ఆగస్టు 8కి వాయిదా వేశామని తెలిపారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని ఉమ్మడి గోదావరి జిల్లాలోని విశ్వవిద్యాలయ అనుబంధ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ అందరికి తెలియజేశామన్నారు.

వరదతో పాట్లు..

- ముంపులోనే లోతట్టు లంక గ్రామాలు
- కొనసాగుతున్న వరద ఉధృతి
- కాటన్ బ్యారేజీ వద్ద 2వ ప్రమాద హెచ్చరిక

ధవళేశ్వరం బ్యారేజి వద్ద గోదావరి ఉధృతి

గోదావరి ప్రవాహం ప్రమాదకర స్థాయికి చేరడంతో దిగువ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని తొమ్మిది మండలాల పరిధిలోని 30 గ్రామాలను జలాలు చుట్టుముట్టాయి. కొన్ని గ్రామాల్లో వంటలు వండి ఆహార పొట్లాలు, తాగునీరు పంపిణీ చేపట్టారు. మిగిలిన ప్రాంతాల్లోనూ అందుబాటులోకి తేవాల్సి ఉంది.

ముంపులోనే అప్పనిరాములలంక గ్రామం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. వాయుగుండం కారణంగా ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్న విషయం విదితమే. రాష్ట్రంలోనూ కురుస్తున్న వర్షాలు వరద తాకిడిని మరింత రెట్టింపు చేశాయి. భద్రాచలం వద్ద సోమవారం సాయంత్రం గంటలకు 39.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. 24 గంటల క్రితం అక్కడ 50.50 అడుగుల నీటిమట్టం నమోదైన విషయం విదితమే.ధవళేశ్వరం వద్ద ఉధృతి యథాతథంగానే కొనసాగుతుండటంతో తూర్పు గోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సుమారు 30 లంక గ్రామాలు ఇప్పటికీ భయం గుప్పెట్లో బిక్కుబిక్కు మంటున్నాయి. కాటన్ బ్యారేజీ వద్ద బ్యారేజీ వద్ద సోమవారం సాయంత్రం 6 గంటలకు 14.60 అడుగుల నీటిమట్టం నమోదయ్యింది.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజోలు సఖినేటిపల్లి మండలంలోని అప్పనరామునిలంకలో పునరావాస కేంద్రానికి రాలేదనే కారణంతో బాధిత కుటుంబాలకు ఆహారం సమకూర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మలికిపురం మండలం రామరాజులంక బాడవలో తాగునీటి సమస్య వెంటాడింది. అప్పనిరాములంక, సఖినేటిపల్లి లంక పరిసర లంక గ్రామాల్లో రెండు వేల పశువులు వరద బారిన పడ్డాయి. లంక గ్రామాల రైతులు ఎక్కువగా పచ్చ మేతపై ఆధారపడి పశు పోషణ చేస్తుంటారు. ప్రస్తుతం పచ్చి గ్రాసం పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. గడ్డి వాములు మునిగిపోయాయి. దీంతో పశు గ్రాసం కొరత ఏర్పడింది. కొన్ని ప్రాంతాలకు మాత్రమే సహాయక చర్యలు అందుతున్నాయని అప్పనరామునిలంక పల్లిపాలెంకు చెందిన కె.కుమారి తెలిపారు. నివాసాల చుట్టూ వరదతో బయటకు వెళ్లాలంటే పడవలను ఆశ్రయించాల్సిందేనని, పిల్లలకు పాలు సరఫరా కాలేదని, తాగునీరు లేదని వాపోయారు.

కాట్రేనికోనలో బాధితులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్

వరద బాధితులను ఆదుకోవాలి

ముమ్మిడివరం ముమ్మిడివరం మండలం వరదబాధిత లంక గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటించింది. లంకాఫ్ ఠానేలంక, కూనలం, గురజాపులంకలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లోతట్టు ప్రాంత్రాలు, లంక పాంత్రాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయన్నారు. బాధిత ప్రజలకు సహాయక చర్యలు అందించాలని, బాధితులను పునరావాస కేంద్రాలకు చేర్చాలని, తక్షణం కుటుంబానికి రూ.ఐదు వేల నగదు, 50 కేజీల బియ్యం, కందిపప్పు, నూనె, కిరోసిన్, పాలు, గుడ్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.దుర్గా ప్రసాద్, సఖిలే సూర్యనారాయణ, పాము బాలయ్య, ఎ.లక్ష్మణరావు కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎన్.వెంకటేష్ పాల్గొన్నారు. అయినవిల్లి మండలం వరద ప్రభావిత ప్రాంతాల్లో అంటూ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ పి.దుర్గారావు దొర అన్నారు వరద ప్రభావిత ప్రాంతాలైన కొండుకుదురు, పొట్టిలంక, గుండమ్మ చెరువు వరద ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ముంపు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులను సందర్శించారు. రోగులకు సత్వర సేవలు అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట సిసి రామకృష్ణ, వైద్యాధికారి డాక్టర్ సునీల్, హెచ్ఎస్ రామారావు, మేరీ, సత్య శ్రీనివాస్, నరసింహారావు పాల్గొన్నారు. మామిడికుదురు వరద ఉధతిలో అప్పనపల్లిలో లోతట్టు ప్రాంతాలన్నీ వరద నీట మునిగాయి. వరద బాధితులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఉన్నత అధికారులు ఆదేశాలు అమలు కావడం లేదని క్షేత్రస్థాయిలో బాధితులు వాపోతున్నారు. రేషన్ కార్డుకు ఒక ఆహార పొట్లం మాత్రమే ఇస్తున్నారని కుటుంబంలో ఐదుగురు సభ్యులు ఉంటే అందరికీ ఎక్కడ సరిపోతుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు మొక్కుబడిగా పరామర్శించి వెళ్లిపోయారని తమ బాధను పట్టించుకోవడం లేదన్నారు. నివాసగహాలు చుట్టూ నీరు చేరినా తమకు మంచినీళ్లు, పాలు, అందడం లేదని బాధితులు వాపోయారు. వరద చుట్టుముట్టిన కుటుంబాల వారందరికీ సహాయం చేస్తున్నట్టు అప్పనపల్లి ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. **అమలాపురం రూరల్** పట్టణానికి చెందిన వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు బోడసకుర్రు, పాసర్లపూడి ప్రాంతాల్లో వరద బాధితులకు ఆహారం, పలువురికి నగదు సాయం అందించారు. సాకుర్రులో ముంపు ప్రాంతాలను టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్ పరిశీలించారు. **కాట్రేనికోన** వరద ప్రభావంతో నష్టపోయిన ప్రతి కుటుంబం కు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాలైన పల్లిపాలెం, పల్లంకుర్రు, నడవపల్లి ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. వరద పూర్తిగా తగ్గే వరకూ బాధితులకు భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు.

కొండుకుదురులో వైద్య శిబిరంలో డిఎంహెచ్ఒ దుర్గారావు

రైతు బజార్లకు పడవపై కూరగాయల తరలింపు

ముమ్మిడివరం లంక గ్రామాల్లో సిపిఎం బృందం

వీర జవాన్ శ్రీనివాస్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలం పేకేరుకు చెందిన భారత సైనికుడు పిట్ట శ్రీనివాస్ (40) ఉగ్రదాడిలో మృతి చెందగా ఆయన భౌతిక కాయాన్ని సోమవారం గ్రామానికి తీసుకు వచ్చారు. భారత సైన్యంలో హవాల్దర్ గా పనిచేస్తూ పేకేరు భీమ్ నగర్‌కు చెందిన పిట్టా శ్రీనివాస్ అంత్యక్రియలను ఆయన స్వగ్రామంలో పూర్తి ప్రభుత్వ, అధికార లాంచనాలతో నిర్వహించారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హవాల్దర్ శ్రీనివాస్ మృతదేహం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం రెవెన్యూ డివిజనల్ అధికారి సింధు సుబ్రహ్మణ్యం, ఆర్మీ, నేవీ అధికారులు, డిసిఎంఎస్ డైరెక్టర్ పేట్టా శ్రీనివాస్ రావు, సర్పంచులు చప్పిడి శ్రీనివాసరావు, వైసిపి నేతలు అధికారులు, పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న మంత్రి వేణుగోపాల కృష్ణ

రోడ్డు నిర్మాణం చేపట్టాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం మండలం వన్నెచింతలపూడి-తాండవపల్లి రహదారి 15 ఏళు గా నిర్మాణం చేపట్ట లేదని సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సామాజిక కార్యకర్త పచ్చిమాల బాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నా ఈ రహదారి నిర్మాణం కేవలం హామీలుగానే మిగిలిపోతున్నాయని చెప్పారు. మెయిన్ విలేజ్ రాజారావు తూము సెంటర్ నుంచి తాండవపల్లి లక్ష్మీపతిరాజు పాక సెంటర్ వరకూ సుమారు ఒక కిలోమీటరున్నర రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ఈ రోడ్డు నిర్మాణం చేయకపోవడం వల్ల గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.విద్యార్థులు ఈ రహదారి నుండే ప్రయాణం చేయాలని, వర్షం వస్తే చేపలు చెరువులను తలపిస్తున్నాయని అన్నారు. ఈ రెండు దళిత పేటలు కావడంతో మా రహదారి నిర్మాణం చేపట్టకుండా ప్రజా ప్రతినిధులు వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యుడు, శెట్టిబత్తుల బాలకృష్ణ, మాజీ వార్డు సభ్యుడు శెట్టిబత్తుల ఆనంద్ (నందా) మంగం వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

స్కూల్ కాంప్లెక్స్‌లతో ప్రయోజనాలు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురంలోని మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ఉర్దూ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల ఉర్దూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ ఎఎంఒఎస్ కె.మొహినుద్దీన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ముఖ్యఅతిథిగా కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికారి కమల కుమారి పాల్గొని ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఉర్దూ ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిఎంఒ సుబ్రహ్మణ్యం, పాఠశాల హెచ్ఎం ఎం,ఖాజా మొహిద్దిన్, రిసోర్స్‌పర్సన్ సుభానీ, సయ్యద్ రూహి పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్ర కుమారికి అవార్డు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం పురపాలక సంఘంలో ఆరోగ్య సేవమిత్రగా పనిచేస్తున్న అంగాని కుమారికి సోమవారం సేవ ఆరోగ్య మిత్ర అవార్డు, రూ.5 వేల నగదు పురస్కారాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో ఆరోగ్య మిత్రలు అవిశ్రాంతంగా ఎనలేని ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. డాక్టర్ వైయస్సార్ ఆరోగ్య సేవ ద్వారా ఆమె అందించిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ అండ్రో, టీం లీడర్ వంగ రవి తదితరులు పాల్గొన్నారు.

రామిశెట్టి కుటుంబానికి పృథ్వి పరామర్శ

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని ఏడిద వైసిపి పార్టీ సీనియర్ నాయకులు రామిశెట్టి వీర్రాజు కుటుంబాన్ని వైసిపి యువ నాయకుడు తోట పథ్వీరాజ్, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం సోమవారం పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైసిపి గ్రామ అధ్యక్షులు పలివెల సుధాకర్, సొసైటీ అధ్యక్షులు రామిశెట్టి శ్రీహరిబాబు, సంగేశ్వర దేవస్థానం చైర్మన్ రామ్ శెట్టి శ్రీనివాస్, కొండేటి కాశీ కృష్ణ పరామర్శించిన వారిలో ఉన్నారు.

స్పందనలో ప్రజా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీనీ నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో 191 అర్జీలను జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి జివి.సత్యవాణి, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎస్.సుధా సాగరతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారులకు తమ లాగిన్ ద్వారా అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి వాటి నివేదికలను ఫోటోలతో సహా యాప్‌లో అప్లోడ్ చేస్తూ సకాలంలో అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలన్నారు. జవాబుదారీతనంతో కూడిన విధంగా అర్జీల పరిష్కారం కోసం స్పందనకు మెరుగైన ప్రత్యామ్నాయంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలన్నారు. అర్హత ఉండి సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు, సేవలు పొందని వారిని గుర్తించి ఆ మేరకు 11 రకాల వారి సమస్యలు పరిష్కారం కొరకు జగనన్న సురక్ష కార్యక్రమం క్రింద ఇంటింటి సర్వే నిర్వహించామన్నారు. పథకాల ప్రయోజనం అర్హులకు చేకూర్చినట్టు చెప్పారు. స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి జిల్లావ్యాప్తంగా స్పందనలో వచ్చిన ఏ ఒక్క అర్జీ తిరిగి ఓపెన్‌కు ఆస్కారం లేకుండా స్పందన వ్యవస్థను బలోపేతం చేసి నాణ్యతతో కూడిన విధంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎ.బోసు బాబు, ఆర్‌డిఒ ప్రతాప్‌రావు, ఎల్‌డిఎం ప్రసాద్, జిల్లా హౌసింగ్ అధికారి సిహెచ్.బాబూరావు, డిఇఒ ఎం.కమల కుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, పంచాయతీరాజ్ రహదారులు శాఖ ఎస్ఇలు కె.చంటిబాబు, బి.రాము, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి, డాక్టర్ పద్మశ్రీ రాణి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సిహెచ్‌వి.భరతలక్ష్మి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి ప్రభాకర్, ఆర్‌టిసి డిఎం ఆర్‌విఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల ర్యాలీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

తమ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని స్వాతంత్ర సమర యోధుల విగ్రహాలకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ న్యాయమైన తమ హక్కులు సాదించేవరకు ఈ పోరాటం ఆగదన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగే మాస్ ర్యాలీలో అందరూ పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఇఇ కె.మురళీమోహన్, ఎఇలు యేసు రాజు, వెంకటరమణ, సాలెం రాజు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన ర్యాలీ

'గడప గడపకూ'లో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి ఆత్రేయపురం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు పరిష్కారం అవుతున్నాయని ప్రభుత్వ విప్ చిర్ల జగ్గరెడ్డి అన్నారు సోమవారం మండలంలోని వద్దిపర్రు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు గురించి వివరాలు తెలుసుకున్నారు ఈ సందర్భంగా పలు సమస్యలను గ్రామస్తులు ఆయనకు వివరించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు,. ఈ కార్యక్రమంలో ఎంపిపి కుండా అన్నపూర్ణ, ఎంపిడిఒ నాతి బుజ్జి, నాయకులు కొరుప్రోలు వెంకటేశ్వరరావు, కనుమూరి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన హాస్టల్ భవనం నిర్మించాలి

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురంలోని కొంకాపల్లి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో శిథిలావస్థలో ఉన్న బిల్డింగును తిరిగి నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త పచ్చిమాల బాబ్జి సోమవారం కలెక్టర్ కార్యాలయం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982లో నిర్మించిన ఈ భవనం నిర్మించి 41 ఏళ్ల పూర్తయ్యిందన్నారు. సుమారు 130 మంది వివిధ పాఠశాలల నుంచి చదువుకుంటూ ఇందులో ఉంటున్నారన్నారు. వసతి గృహం పైకప్పు శిథిలమై పెచ్చులూడి పోతోందని, శిథిలాలను నామమాత్రంగా రిపేరు చేసి సంబంధిత అధికారులు కాలక్షేపం చేస్తున్నారన్నారు. ఏ సమయంలోనైనా స్లాబ్ పెచ్చులూడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు ఇచ్చిన వారిలో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సూర్యనారాయణ, శెట్టిబత్తుల బాలకృష్ణ తదితరుల పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన 23 అంశాలకు 22 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ రాణి మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని పట్టణ పరిశు భ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. పరిశరాలను పరిశుభ్రంగా వుంచుకుంటూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్యబాబు, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ త్రిపర్ణ రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

మణిపూర్ ఘటనపై నిరసన ర్యాలీలు

మణిపూర్ సంఘటనలపై సోమవారం పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజోలు అంతర్వేది పాలెం నుండి మలికిపురం సెంటర్ వరకు క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాద్, మాజీ ఎంఎల్ఎ గొల్లపల్లి సూర్యారావు, సంఘీభావం తెలిపారు. **ముమ్మిడివరం** పాస్టర్స్ ఫెలోషిప్, సిఐటియు సిపిఎం, విద్యార్థి సంఘాలు, ఆర్‌పిఐ, ముస్లిం సంఘాలు, కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన కాశి వాని తూము వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళుర్పించారు. తహశీల్దారు కార్యాలయం వద్ద రాస్తారోకో చేశారు. డిటి యడ్ల రాంబాబుకు వినతిపత్రం అందించారు. పౌల్ రాజు,ఉంద్రాజవరపు ప్రసాద్, జోసెఫ్, బి.జయరాజు, ఎం. ఇమ్మానుయేలు, ఎస్ బాలరాజు, మహమ్మద్ హుస్సేన్, గౌస్, ఆలీ, సుధీర్, శ్రీను, శరత్, సిఐటియు నాయకులు గుదే దుర్గా ప్రసాద్, లక్ష్మణ్ పాల్గొన్నారు. **అంబాజీపేట** దళిత ఐక్య వేదిక ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. నెల్లి వెంకటరమణ, కోట రామ్మోహనరావు, పాముల రాజేశ్వరీదేవి, సర్పంచ్ నాగబత్తుల శాంతా కుమారి, ఎంపిపి డి.వెంకటేశ్వరావు, జెడ్పిటిసి బూడిద వరలక్ష్మి, జివి.రాఘవులు, జంగా గౌతమ్, కొంకి రాజమణి, గోసంగి సత్యనారాయణ, నక్కా బాస్కరరావు, పులిదిండి సత్యనారాయణ, వరలక్ష్మి, సర్పంచ్ జల్లి బాలరాజు, నాగవరపు నాగరాజు పాల్గొన్నారు.



రాజోలులో..

అంబాజీపేటలో..

సిఎం జగన్ పాలనలో మద్యం ఏరులు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

మద్యపాన నిషేధం దశలవారీగా విధిస్తానంటూ సిఎం జగన్ మహిళలను మోసగించారని మద్యపాన నిషేధం ఎలా ఉన్నా గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందని టిడిపి మహాశక్తి చైతన్య రథయాత్ర మహిళలు ధ్వజమెత్తారు. చల్లపల్లి పంచాయితీ వాసాలతిప్పలో సోమవారం టిడిపి నాయకురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహాశక్తి చైతన్య రథయాత్రను ఇంటింటికీ నిర్వహించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి పథకాలను వివరించారు. రాష్ట్ర మహిళా మీడియా కో ఆర్డినేటర్ మద్దుల అను రాజేశ్వరి, గెల్లా మీనా కుమారి, యనమదల లక్ష్మి, మోకా పార్వతి, పేరూరి విజయలక్ష్మి, మట్టపర్తి భారతి, పోతుల నాగలక్ష్మి, మాజీ ఎంపిటిసి బూసి బుజ్జిదొర, నిమ్మకాయల చెల్లయ్య నాయుడు, గొలకోటి చిన్న, లంకే భీమరాజు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి

అంతర్రాష్ట్ర నేరస్తుల అరెస్ట్

ప్రజాశక్తి - కాకినాడ క్రైం

పలు హత్య, దోపిడీ కేసుల్లో అంతర్రాష్ట్ర నేరస్తులను కాకినాడ పోలీసులు సోమవారం విశాఖలో అరెస్టు చేశారు. 2023 జూన్, జూలై నెలల్లో జాతీయ రహదారిపై దోపిడీ, హత్య నేరాల్లో వీరు ప్రధాన నిందితులు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోపాల్‌పూర్‌కు చెందిన సునీల్ సాహు(45), ఒడిశా రాష్ట్రం సంబల్‌పూర్ జిల్లా బుర్లా గ్రామానికి చెందిన రాజ్ బిందా సింగ్(30) ఈనెల 16వ తేదీ రాత్రి 9.30 గంటలకు జాతీయ రహదారిపై రాజుల కొత్తూరు గ్రామ శివారున జరిగిన సంఘటనకు సంబంధించి నమోదైన కేసులో,అదే రోజు రాత్రి 11.30గంటలకు ఎర్రకోనేరు-హంసవరం రహదారిలో జరిగిన కేసులో, గత నెల 12న సామర్లకోట-పిఠాపురం రహదారి కుమారపురం శివారులో జరిగిన కేసులో నిందితులని ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఇద్దరు నిందితులు ఆటో ప్రయాణికుల్లా ఎక్కి నిర్జన ప్రదేశానికి ఆటో చేరుకోగానే డ్రైవర్, ఆటోలోని ప్రయాణికులపై దాడి చేసి బంగారు ఆభరణాలు, నగదు, విలువైన వస్తువులు దోచుకుంటారని తెలిపారు. అలాగే ఇళ్లల్లో ఒంటరిగా ఉన్న మహిళలపై దాడులు చేసి మారణాయుధాలతో బెదిరించి ఎదురు తిరిగితే చంపి విలువైన వస్తువులు తీసుకుని పరారవుతారన్నారు. సునీల్ సాహు ఓ కేసులో జీవిత ఖైదీ అని తెలిపారు. నిందితులపై ఇతర రాష్ట్రాల్లోనూ పలు కేసులు ఉన్నాయన్నారు. ఈనెల16వ తేదీ రాత్రి 9.15 గంటల సమయంలో తేటగుంట వద్ద ఆటో ఎక్కి నిర్మానుష్య ప్రదేశానికి చేరుకోగానే ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి చేసి ఆటోను తీసుకుని పారిపోయారన్నారు. అదే రోజు రాత్రి 11.30 గంటలకు తుని మండలం యర్రకోనేరు వద్ద పప్పు సత్యవతి(62)ని హత్యచేసి పుస్తెల తాడు, సెల్‌ఫోన్‌ను తీసుకెళ్లిపోయారన్నారు. జూన్ 12వ తేది రాత్రి 8 గంటల సమయంలో సామర్లకోట నుంచి పిఠాపురానికి ఏడుగురు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ఆపి డ్రైవర్‌ను పొడిచి పడేశారన్నారు. మిగిలిన ప్రయాణికులను బెదిరించి నగదు, బంగారం దోచుకున్నారన్నారు. కుమారపురం శివారున ఆటోని వదిలేశారన్నారు. జూన్19న కైలాష్ బాగ్‌ను పోలీసులు అరెస్టు చేశారన్నారు. మరో నిందితుడు సునీల్ సాహూ పరారీలో వున్నాడన్నారు. విశాఖలో సాహూతో రాజ్‌బిందా సింగ్‌ను చేశామన్నారు. వారి నుంచి ఆటో, బంగారు నగలు, నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని పట్టుకునేందుకు కృషి చేసిన పెద్దాపురం డిఎస్‌పి లతాకుమారి, తుని రూరల్, జగ్గంపేట, ప్రత్తిపాడు సిఐలు, ఎస్‌ఐలు, జిల్లా సిసిఎస్ అధికారులు, సిబ్బందిని ఎస్‌పి అభినందించి, రివార్డులు ప్రకటించారు.

బాలికను ప్రలోభాలకు గురి చేసిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- కాట్రేనికోన

బాలికను ప్రలోభ పెట్టి ఇంటి నుంచి తీసుకెళ్లిన వ్యక్తిని అరెస్ట్ చేశామని అమలాపురం డిఎస్‌పి ఎం.అంబికాప్రసాద్ తెలిపారు. కాట్రేనికోన మండలం ఉప్పూడికి చెందిన బాలికను జులై 15న అదేగ్రామానికి చెందిన గ్రామానికి చెందిన చింతా పవన్ కుమార్ మాయమాటలు చెప్పి తీసుకుని వెళ్లిపోయాడు. బాధిత బాలిక వాంగ్మూలం ఆధారంగా నిందితునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జులై 31న పవన్‌కుమార్‌ను అరెస్టు చేసి అతని నుంచి నేరానికి ఉపయోగించిన బైకును, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముమ్మిడివరం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. నిందితునికి న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని, నిందితుని రాజమహేంద్రవరంలో సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ టి.శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసును ముమ్మిడివరం సిఐ ఎన్.కొండయ్య పర్యవేక్షణలో కాట్రేనికోన ఎస్ఐ. టి.శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారని అమలాపురం డిఎస్‌పి అంబికా ప్రసాద్ తెలిపారు.

తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పెట్రోల్ బంకులో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆత్రేయపురం పెట్రోల్ బంకులో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో సిఐ కిషోర్, సిబ్బంది సోమవారం తనిఖీలు నిర్వహించారు. పెట్రోల్ అమ్మకాలు, నిల్వలు రికార్డులను పరిశీలించి వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. బంకులో సరైన సౌకర్యాలు లేకపోవడంతో బంకు యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. డిఎస్‌పి మాట్లాడుతూ పెట్రోల్ క్వాలిటీని పరీక్షించేందుకు నమూనాలను సేకరించామన్నారు. వీటిని విశాఖ ల్యాబ్‌కు పంపుతామన్నారు. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీల్లో కోనసీమ జిల్లా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేష్, తహశీల్దార్ విజయ్‌కుమార్, ఎంఎస్‌ఒ రమాదేవి, విఆర్‌ఒ పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

రాజానగరం : తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితులను రాజానగరం పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి వెండి, బంగారం నగలు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిఐ పి.కాశీవిశ్వనాథ్, ఎస్ఐ సుధాకర్ సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈ నెల 20న కొంతమూరుకు చెందిన అత్తిలి సత్యనారాయణ ఇంటికి తాళాలు వేసి కర్నాటక వెళ్లారు. తిరిగి 24న వచ్చారు. ఇంటి తలుపులు, లోపల బీరువా తులుపులు తీసి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా 134 గ్రాముల బంగారు నగలు, 1,476 గ్రాముల వెండి వస్తువులు, ఒక సెల్‌ఫోన్ చోరీకి గురైనట్టు గుర్తించారు. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు.

దిగిరాని ధరలు

- కూరగాయలు కూడా కొనలేని పరిస్థితి
- అరకొరగానే రాయితీ టమాటా విక్రయాలు
- రేషన్ షాపుల్లో నిలిచిన కందిపప్పు పంపిణీ
- గగ్గోలు పెడుతున్న పేదలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పెరుగుతున్న ధరల భారం సామాన్యులను వెంటాడుతూనే ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో దిగి రానంటున్న ధరలు ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అన్ని రకాల నిత్యవసరాలు ధరలతో పాటు పెరుగుతున్న కూరగాయల ధరలు సామాన్యుల కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి.

కాక పుట్టిస్తున్న కూరగాయల ధరలు

రెండు నెలలుగా కాయగూరలు ధరలు ఆకాశాన్నింటి దిగి రానంటున్నాయి. ప్రధానంగా టమోటా ధరలు విపరీతంగా పెరిగాయి. కిలో రూ.200కి అమ్ముతున్నారు. వంకాయలు రూ.40 నుంచి రూ.60, దొండకాయలు రూ. 20 నుంచి రూ.40, బెండకాయలు రూ.30 నుంచి రూ.40, పచ్చిమిర్చి రూ.120, బీర రూ.50 నుంచి రూ.70, అల్లం రూ.160 నుంచి రూ.200, బీర రూ.50 నుంచి రూ.70, క్యారెట్, బీట్ రూట్ రూ.40, చిక్కుళ్ళు రూ. 80, కొత్తిమీర కిలో రూ. 80కి అమ్ముతున్నారు.

అరకొరగా రాయితీ టమోటాలు

నెల రోజులుగా టమోటా ధరలు ఏమాత్రం తగ్గడం లేదు. దీంతో పేద, మధ్యతరగతి వర్గాల కష్టాలు రెట్టింపు అయ్యాయి. చాలామంది టమోటా వైపు చూడటమే మానేశారు. రూ.200 వెచ్చించి కిలో టమాటాలు కొనాలంటే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాయితీ ధరలకే టమోటాలను పంపిణీ చేయాల్సి ఉంది.రైతు బజార్లు ఉన్న ప్రాంతాల్లో కిలో రూ.50కే రాయితీపై టమోటాలు పంపిణీ చేస్తున్నామని ఆర్భాటంగా ప్రకటించినా అరకొరగానే సాగుతోంది.

కాకినాడ నగరంలో సుమారు 50 లక్షల మంది జనాభా నివసిస్తుండగా గాంధీనగర్, ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద మాత్రమే రెండు చోట్ల రైతు బజార్లు అందుబాటులో ఉన్నాయి. గత నెలలో చిత్తూరు జిల్లా పలమనేరు, మదనపల్లి తదితర ప్రాంతాల నుంచి 5 లోడ్లు (25 టన్నులు) టమోటాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు దిగుమతి చేశారు. మొక్కుబడిగా కొద్ది రోజులు మాత్రమే రాయితీపై పంపిణీ చేశానేజ నగర జనాభాకనుగుణంగా అందించలేకపోయారు. ప్రస్తుతం వారం రోజులుగా ఈ రెండు రైతు బజార్లలో రాయితీ టమోటాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో బహిరంగ మార్కెట్లో రూ.180 నుంచి రూ. 220 వరకు టమోటాలు అమ్ముతుండగా సామాన్యులు అటువైపు వెళ్ళడం లేదు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతు బజార్లలో రూ.50కి రాయితీ టమోటాలను అందుబాటులో ఉంచాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఉడకని పప్పులు

బహిరంగ మార్కెట్లో పప్పులను అధిక ధరలకు అమ్ముతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను నియంత్రించ లేకపోవడంతో ప్రజలపై భారాలు మరింత పెరుగుతున్నాయి. ప్రజలు ఎక్కువగా వాడుతున్న కందిపప్పు ధర కిలో రూ.150కి విక్రయిస్తున్నారు. రేషన్ దుకాణాల్లో కిలో కందిపప్పు రూ.67కే ఇచ్చేవారు. జిల్లాలో ఉన్న 6,45,811 బియ్యం కార్డు లబ్ధిదారులకు సుమారు 600 మెట్రిక్ టన్నులు అవసరం ఉంటుంది. రెండు నెలలుగా ప్రభుత్వం కందిపప్పు పంపిణీ పూర్తిగా నిలిపివేసింది. ఆగస్టు నెలలో కూడా కందిపప్పు పంపిణీ లేదని సివిల్ సప్లయీస్ అధికారులు సంకేతాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి రేషన్ దుకాణాల ద్వారా రాయితీ కందిపప్పును పంపిణీ చేయాలని ప్రజలంతా కోరుతున్నారు.

కాకినాడలో రైతు బజార్

ధరలను అదుపులో ఉంచాలి

అన్ని రకాల ధరలు పెరిగిపోయాయి. నిత్యవసరాల ధరలు అయితే గత రెండేళ్ల నుంచి విపరీతంగా పెరుగుతున్నాయి.మాలాంటి సామాన్యులు కొనలేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం.రేషన్ దుకాణాల ద్వారా రాయితీ కందిపప్పు పంపిణీ చేస్తే పేద, మధ్యతరగతి ప్రజలకు ధరాఘాతం నుంచి కొంతైనా ఉపశమనం కలుగుతుంది.

- ఎస్.పైడమ్మ, స్వర్ణాంధ్ర కాలనీ, కాకినాడ

రాయితీ టమోటాలు ఇవ్వట్లేదు

కాకినాడ ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రైతు బజారులో ఇటీవల రెండు మూడు రోజులు మాత్రమే రాయితీ టమోటాలు విక్రయించారు. ఆ తర్వాత అమ్మడం నిలిపివేశారు. అధికారులను అడుగుతుంటే సరఫరా నిలిచిపోయిందని చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రాయితీ టమోటాలను అందించాలి.

- ఎస్.బషీర్, గృహిణి, డైరీ ఫామ్ సెంటర్, కాకినాడ

యానాం వార్తలు

వరద పరిస్థితి పరిశీలన

యానాంలో గౌతమి గోదావరి నది వరద ఉధృతిని సోమవారం స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్‌ఎఒ మునిస్వామితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాజీవ్ బీచ్, యానాం - ఎదుర్లంక బాలయోగి వారధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. జెండా స్తంభం సమీపంలో వరద నీరు చేరడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇంజన్ల సహాయంతో వరద నీటిని తోడుతున్నారు. వారి వెంట పిడబ్ల్యుడి ఇఇ వీర సెల్వం, ఎఇ నాగరాజు, జెఇ భగవాన్ తదితరులున్నారు.

13న అన్న సమారాధన

మొహర్రం ముగింపులో భాగంగా ఆగస్టు 13న అన్నసమారాధన నిర్వహిస్తామని ముస్లిం నాయకులు తెలిపారు. యానాంలో మొహరం ఉత్సవాలు ఆఖరి రోజైన సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సుబ్రహ్మణ్య భారతి వీధిలో ప్రసిద్ధిగాంచిన పీర్ పంజా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వీరభద్రరావు సేవలు అభినందనీయం

ప్రజాపనుల శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన బస్సా వీరభద్రరావు సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. సోమవారం సాయంత్రం స్థానిక పిడబ్ల్యుడీ కార్యాలయంలో వీరభద్రరావు ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన సభ నిర్వహించారు. ఇఇ వీరసెల్వం, ఎఇ కాళ్ల నాగరాజు, జెఇలు, తోటి ఉద్యోగులు, వీరభద్రరావు, అమ్మాజీ దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం తోటి ఉద్యోగస్తులు ర్యాలీగా వీరభద్రరావును ఇంటికి సాగనంపారు. వీరభద్రరావు 30 ఏళ్లుగా ప్రజా పనుల శాఖలో పనిచేశారు.

రైజ్ మాడ్యూల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడలోని స్పందన హాల్లో కలెక్టర్ కృతికాశుక్లా, జెసి ఎస్.ఇలాక్కియా, డిఆర్‌ఒ కె.శ్రీధర్‌రెడ్డి, రైజ్ కో-ఆర్డినేటర్ ప్రసాద్‌తో కలిసి జగ్గంపేట నియోజకవర్గానికి సంబంధించిన రైజ్ మాడ్యూల్‌ను ఆవిష్కరించారు. జిల్లాలో వివిధ నియోజకవర్గాల వారీగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఇంగ్లీష్ నైపుణ్యాలు పెంపొందించే నిమిత్తం రైజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జగ్గంపేట నియోజకవర్గం అన్ని ప్రభుత్వ పాఠశాలలో విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టరు కతికా శుక్లా ముచ్చటించారు.

సిఎం జగన్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

సిఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించిన బిసి గర్జనపై మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా తాళ్లరేవులో టిడిపి నాయకులు తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేశారు. అనంతరం ముఖ్యమంత్రి దిష్టిను బొమ్మను దహనం చేశారు. ప్రభుత్వానికి, సిఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైసిపి పాలనలో బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. టిడిపి అమలాపురం పార్లమెంటు బిసి సెల్ అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, దాట్ల పృథ్వీ, టిడిపి బిసి సెల్ కో-ఆర్డినేటర్ కుడిపూడి బుజ్జి, పిల్లి నాగరాజు, రెడ్డి సుధీర్, టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి, కట్టా త్రిమూర్తులు, దెయ్యాల జానీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంఘటన స్థలానికి కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది చేరుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

న్యాయవాది హత్యకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

విజయవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ఆర్.విఠల్‌బాబును కిడ్నాప్ చేసి పాశవికంగా హత్య చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రత్తిపాడు కోర్ట్ ఆవరణలో న్యాయవాదులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టంశెట్టి పుల్లయ్య మాట్లాడారు. నిందితులపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం న్యాయవాది విఠల్‌రావుకు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బి.మధుబాబు, ఉపాధ్యక్షులు ఎం.గంగాధర్, కల్చరల్ కార్యదర్శి శివకుమార్, సీనియర్ న్యాయవాదులు చెలంకూరి రామకృష్ణ, ఆర్.వెంకట్రావు, కె.శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శి ఎం.మంజుష, రాయి అచ్యుత రామారావు, పలివెల నాగేంద్రరాజు, లోవదుర్గ న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు కోసం కృషి

ప్రజాశక్తి - కాజులూరు

సంక్షేమ పథకాలు అమలుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని జడ్‌పిటిసి సభ్యులు వనుం వెంకటసుబ్బారావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మాత భారతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు పనుల్లో జరిగిన ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి సభ్యులు సుబ్బారావు మాట్లాడారు. ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. ఇవి సక్రమంగా అమలయ్యేలా ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ చేపట్టే పనులకు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు పెద్దిరెడ్డి వెంకటరమణ రేకాడి విజయ ఫణీంద్ర, ఎంపిడిఒ రత్నరాజ్, డిటి సుబ్బారావు, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న పాస్టర్లు, క్రైస్తవులు

మణిపూర్ మారణహోమాన్ని నిరసిస్తూ శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమానికి నిరసనగా ఏలేశ్వరంలో పాస్టర్స్ ఫెలోషిప్, జీసస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సుమారు 5వేల మందితో క్వారీ ఏరియా నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం తహశీల్దార్ ఎం.చిన్నారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జీసస్ మినిస్ట్రీస్ చైర్మన్ డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు మాట్లాడారు. మణిపూర్ అల్లర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలన్నారు. దగ్ధమైన చర్చిలు స్థానంలో నూతన చర్చిలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ రాజా చౌదరి, జోసఫ్ ఆండ్రూస్, రెడ్డి ఆనంద్‌పాల్, జాన్ విల్సన్‌బాబు, ఎలైజా, డేవిడ్ రాజు, సీమోన్‌ల ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

13న కాపునాడు ఐక్య సభ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఆగస్టు 13న రాజకీయాలకతీతంగా కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన కాపు నాయకులతో కాకినాడలోని శుభం కాపు కళ్యాణ మండపంలో సభను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు నాయకులు తెలిపారు. ఈ సభలో అందరి అభిప్రాయాలను తీసుకుని ఐక్య కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సోమవారం కాకినాడలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వాదా ప్రసాద్, ఉపాధ్యక్షుడు తుమ్మల శ్రీరామమూర్తి ఈ వివరాలను విలేకర్లకు వివరించారు. 26 జిల్లాలకు చెందిన కాపు నాయకులు ఈ సభకు హాజరుకానున్నారన్నారు. అనంతరం ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కాపు సంఘ నాయకులు జె.నాగబాబు, జి.కొండలరావు, డి.జ్యోతి, జె.సత్యనారాయణ, ఎస్.శ్రీనివాస్, ఎ.రమేష్, టి.మురళి, వై.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలివ్వాలని వినతి

ప్రజాశక్తి- పెద్దాపురం

జగ్గంపేట మండలం గుర్రంపాలెంలోని సీలింగ్ భూములను సాగు చేసుకుంటున్న పేదలకు వెంటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి అనంతరం ఆర్‌డిఒ సీతారామారావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం రైతు కూలీ సంఘం నాయకులు సురేష్ మాట్లాడుతూ. సీలింగ్ భూమిలో రాళ్లు, రప్పలను తొలగించుకుని పేదలు సాగు చేసుకుంటున్నారన్నారు. దీనిపై పెత్తందారుల కన్ను పడిందన్నారు. దీన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వెంటనే పేదలకు పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు.

సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మెయిన్ రోడ్డు జట్కా స్టాండ్ సమీపంలోని తాళ్లూరు వారి సత్రంలో సోమవారం సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రోటరీ సహకారంతో 8వ సారి నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అద్దేపల్లి రమేష్, పి.సోమరాజు, వేణుగోపాలకృష్ణ, కరెడ్ల రాజా, అత్తిం రమేష్, రాజేష్, చంద్రశేఖర్‌శర్మ, నాగేంద్ర, రవి, శివ, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం ఇఒపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తూ, విధులకు గైర్హాజరవుతున్నారనంటూ తాళ్లరేవు కేశవ స్వామి దేవస్థానం ఇఒ యర్రా వెంకటేశ్వరరావుపై ఆ దేవస్థానం చైర్మన్ కొల్లు శ్రీనివాసరావు కలెక్టర్ కృతికాశుక్లాకు సోమవారం ఫిర్యాదు చేశారు. దేవస్థానంలో సమస్యలు, ఉద్యోగుల అలసత్వం, సమయపాలన పాటించకపోవడం తదితర విషయాలను ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే ఎకౌంట్స్ వెరిఫికేషన్ చేయాలని కోరారు. దీనికి సంబంధించిన ఆధారాలను సైతం సోమవారం స్పందనలో కలెక్టర్‌కు అందించానని ఆయన తెలిపారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు.

విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -కరప

గురజనాపల్లి హై స్కూల్‌లో విద్యా శాఖ ఉత్తర్వులు ప్రకారం పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ నిర్వహించామని హెచ్‌ఎం ఎం.సాయిమోహన్ తెలిపారు . కెరీర్ గైడెన్స్‌లో శిక్షణ పొందిన సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు ఐ.ప్రసాదరావు ఆర్ట్స్ అండ్ మూవీస్(సినిమా) అంశంపై అవగాహన కల్పించారు. దీనికి సంబంధించిన వీడియో కూడా ప్రదర్శించారు. పదో తరగతి పూర్తిచేసిన తర్వాత, విద్యార్థులు తమ అభిరుచులకు అనుగుణంగా వివిధ కళలు అభ్యసించడం ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందొచ్చని ఆయన అన్నారు. ఆర్ట్స్ విభాగంలో మ్యూజిక్, పెయింటింగ్, నాట్యం, పాటలు, మిమిక్రీ వంటి పలు అంశాల్లో ఆశక్తి గలవారు, తర్ఫీదు పొంది భవిష్యత్తులో ఆయా రంగాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.వరలక్ష్మి, జి.అర్జునరావు పాల్గొన్నారు.

మునగాకు ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-సామర్లకోటరూరల్

రాష్ట్రంలో కొత్తగా అందుబాటులోకి తెస్తున్న న్యూట్రిషన్ గార్డెన్, మునగాకు ప్రయోజనాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ జె.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో కోస్తాంధ్రలో 11 జిల్లాల ఎంపిడిఒలు, ఉపాధి ఎపిఒలు, టెక్నికల్ సిబ్బందికి మునగాకు ప్రాధాన్యత, వాటిలోని పోషక విలువల ప్రచారానికి శిక్షణ కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. ఈ శిక్షణను ఇటిసి ప్రిన్సిపల్ వేణుగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజిఎన్‌ఆర్‌జిఎస్, ఎన్‌ఆర్‌ఎల్‌ఎం కన్వర్జెన్సీ, అగ్రి న్యూట్రీషన్ గార్డెన్, మోర్ ఇంకా ప్లాంటేషన్ సంయుక్త నిర్వహణలో మునగాకు సాగు, వాటిలోని ప్రోటీన్లు, పోషకాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించంఏదుకు ఈ శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. మునగాకులోని పోషక విలువలు, వాటి ప్రయోజనాలపై చీఫ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్, ఆఫీస్ మేనేజర్ శ్రీనివాసు, ఫ్యాకల్టీలు ప్రసాద్, నిహారిక, ఎంఎస్ఎన్.రెడ్డి, ఆంజనేయులు అధికారులకు వివరించి అవగాహన కల్పించారు.

మానవ అక్రమరవాణను నివారించాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మానవ అక్రమ రవాణాను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రత్తిపాడు బార్ ప్యానల్ అడ్వకేట్ బుగతా శివ అన్నారు. మండలంలోని ఎర్రవరంలో సోమవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలికలను, మహిళలను నమ్మించి వ్యభిచారంలోకి దింపుతున్న సంఘ వ్యతిరేక శక్తులపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రముఖ న్యాయవాది అవసరాల దేవి మాట్లాడుతూ మహిళలకు రక్షణకు అనేక చట్టాలున్నాయన్నారు. వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, వసిపి నాయకులు నీరుకొండ సత్యనారాయణ, గుల్లంపూడి గంగాధర్ తదితరులున్నారు.

మహారాజశ్రీ రాజమండ్రి 10వ అదనపు జిల్లా జడ్జి (SC&ST) వారి కోర్టులో
E.A.No.69/2017, E.P.No.2/2015
O.S.No. 79/2010

బిట్వీన్:
హనుమంతు విఘ్నేశ్వరరావు అనే గణేష్
...పిటీషనరు (డి. హెచ్. ఆర్)
అండ్
మునుకుట్ల నాగ ఆదిత్య
...రెస్పాండెంటు (జె.డి. ఆర్)

టు: మునుకుట్ల నాగ ఆదిత్య, తండ్రి: (లేటు) నాగేశ్వర శ్రీనివాసరావు, డో.నెం. 6-3-6/10, ఫ్లాట్ నెం. జి-1, కోడూరి ప్లాజా, చల్లపల్లి వారి వీధి, ఇన్నీసుపేట, రాజమండ్రి.

నోటీసు

సదరు పై నెంబర్లు గల పిటీషనులో మీకు ఎన్నిమార్లు నోటీసు పంపించినను మీకు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. దాని కారణంగా శ్రీ కోర్టు వారు మీకు నోటీసు ప్రజాశక్తి పత్రికలో ప్రచురించుటకు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. మీకు నోటీసు ప్రజాశక్తి పత్రికలో ప్రచురించి పై పిటీషను **ది.21-08-2023 సం॥రం తేదీన మీరు కోర్టుకు ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగా ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.** సదరు వాయిదా రోజున మీరు కోర్టుకి హాజరు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

రాజమండ్రి, **కె.వెంకటరావు**
01-8-23. **కె.శ్రీరామమనోహర్**
పిటీషనరు తరుపు న్యాయవాదులు
సెల్: 94402 54625

బహిరంగ ప్రకటన

నా క్లయింటు కోనసీమ జిల్లా, రాయవరం మండలం, పసలపూడి గ్రామం, డో.నెం. 1-264 కాపురస్తులు **మండ సూర్యనారాయణ రెడ్డి గారి కుమారుడు మండ సత్యనారాయణ రెడ్డి** నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికీ ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా..,

నా క్లయింటు పసలపూడి గ్రామంలో సర్వే నెం.350/1 చ॥గ॥స్థలము 87.77 ఖాళీ స్థలములో ఇలు నిర్మించుకుంటున్నారు. ది.15-04-2021వ తేదీన ద్వారంపూడి శారదా, అల్లం దేవి అనంతలక్ష్మి అను వార్ల దగ్గర ఈ ఆస్తిని కొనుగోలు చేసి రామచంద్రపురం సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేయించడం జరిగింది. దస్తావేజు నెం. 1844/2021 దీనికి లింకు డాక్యుమెంటు నెం. 1050/1962 మరియు 2778/2002 మరియు 871/2020 మరియు 939/2020 దస్తావేజులు అయ్యి ఉన్నవి. నా క్లయింటు దస్తావేజుకు లింకు డాక్యుమెంట్సు దానికి ఇతర దస్తావేజులను సంచిలో పెట్టుకొని ది.17-07-2023వ తేదీన రామచంద్రపురంలో జిరాక్సు తీసుకొని మోటారు సైకిల్ పై వస్తుండగా మార్గంమధ్యలో 2778/2002 దానపట్టా శెటిల్‌మెంటు దస్తావేజు 871/2020 సవరణ దస్తావేజు 1050/1962 సేల్ డీడ్ డాక్యుమెంటు దస్తావేజులు పడిపోయినవి. ఈ విషయం రామచంద్రపురం పి.ఎస్.ఐ. వారికి రిపోర్టు ఇవ్వడం జరిగింది. నా క్లయింటు దస్తావేజులను Veritas Finance Pvt. Ltd., వారికి కాకినాడ బ్రాంచ్ వారికి తాకట్టు పెట్టి డబ్బులు అప్పుగా తీసుకొనుచున్నాడు. నా 2778/2022 దానపట్టా శెటిల్‌మెంటు దస్తావేజు, 871/2020 సవరణ దస్తావేజు 1050/1962 సేల్ డీడ్ దస్తావేజుకు ప్రత్యమ్నాయంగా సర్టిఫైడ్ కాపీలను ఆ బ్రాంచుకు హామీగా అందజేసినారు. కావున యావన్మంది ప్రజానీకానికీ తెలియజేయునది ఏమనగా సదరు ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఎడల నా క్లయింటుకు తెచ్చి ఇవ్వగలరు అని తెలియజేస్తున్నాము. ఆ దస్తావేజులు ఎవరికైనా దొరికిన ఎడల ఎవరైనా వినియోగించిన ఎడల చట్ట విరుద్ధము అవును. అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడును. కావున ఈ ప్రకటన జారీ చేయడమైనది.

నేతల జనార్ధనరావు
అడ్వకేట్ - నోటరీ, డో.నెం.58-2-26, జగన్నాయక్‌పూర్, కాకినాడ. సెల్: 98493 43504

ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా.., నాపేరు చీకురుమెల్లి సునీల్ దత్ నా పాస్‌పోర్టు నెం. **V7877549** నందు మా అమ్మ గారి పేరు **"చీకురుమెల్లి మేరి కరుణమ్మ"** గా నమోదు అయి ఉన్నది. నా ఎస్.ఎస్.సి., ఆధార్, బ్యాంకు అకౌంటు నందు **"చీరుకుమెల్లి లక్ష్మీ మేరి కరుణమ్మ"** గా నమోదు అయినది. మాఅమ్మగారి పేరు **"చీకురుమెల్లి మేరి కరుణమ్మ" మరియు "చీకురుమెల్లి లక్ష్మీ మేరి కరుణమ్మ"** రెండూ ఒక్కటే అనిన్నీ రెండు పేర్లూ మా అమ్మ గారివేనని ఇందుమూలముగా ఈ ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాను.

చీకురుమెల్లి సునీల్‌దత్
తండ్రి: నాగేశ్వరరావు, సరిపల్లి,
అమలాపురం, అమరావతిపురం,
31-7-23. ఉప్పలగుప్తం మండలం.

PUBLIC NOTICE

This Public Notice is given on instructions of my client **DUDI SIVA NAGARAJU, S/o. Narasimharao,** Resident of Kadali Village, Razole Mandal, Dr.B.R.Ambedkar Konaseema District.

1) My client borrowing loan form **M/s CHOLAMANDALAM INVESTMENT AND FINANCE COMPANY LIMITED (CIFCL),** Amalapuram Branch, My client Dudi Siva Nagaraju purchased the property under registered Sale Deed dated 29-06-2018 under Document No. 2213/2018 from 1) Vinjamuri Venkata Surya Kumar Satya Ratnam, 2) Vinjamuri Ramakrishna Sharma, 3) Vinjamuri Sai Srinivasarao and 4) Vinjamuri Ramalakshmi.

2) Therefore this Public Notice is issued to all, that anybody has claim/right/objection over the schedule property, they shall come forward with documentary proof within Seven days from the date of this notice to the under signed, else it shall be deemed that there are no claims or objections over the schedule property, and the transaction will be proceeded with.

SCHEDULE

Dr.B.R.Ambedkar Konaseema District, previously East Godavari District, Razole Sub Registry, Razole Mandal, Kadali Grama Panchayat, Kadali Village, Gramakantam, R.S.No. 704/1 an extent of North East corner Ac. 0-04 1/2 cents equalant to 218 Square Yards site **(Presently RCC Building is in constrution stage)** (Ac. 0-01 cent was left for laying road) in Ac. 0-16 1/2 cents in Ac. 14-56 cents bounded by: ***East:*** 13 feet width Passage - 71 Links. ***West:*** Site of kadambari Surya Bhaskararao -68 Links. ***South:*** Site of Dudi Adinarayana - 66 Links. ***North:*** Roda - 65 Links with all easementary rights therein.

T.SANTHI KAMALA
Advocate,
AMALAPURAM - 533201,
Dr. BR Ambedkar Konascema District.
Cell No. 98665 45823

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు మండలం, కడలి కాపురస్తులు **దూది నరసింహారావు గారి కుమారుడు దూది శివ నాగ రాజు** గారి సంజాయిషీపై యావన్మందికీ తెలియజేయునది ఏమనగా..,

నా క్లయింటు చోలమండలం ఇన్‌వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ అమలాపురం బ్రాంచ్ నుంచి లోను తీసుకొనుచున్నారు. నా క్లయింటు దూది శివనాగరాజు 1) వింజమూరి వెంకట సూర్య కుమార్ సత్యరత్నం, 2) వింజమూరి రామకృష్ణ శర్మ, 3) వింజమూరి సాయి శ్రీనివాసరావు మరియు 4) వింజమూరి రామలక్ష్మి గార్ల నుంచి ది.29-06-2018న డాక్యుమెంటు నంబరు 2213/2018గా క్రయ దస్తావేజు పొందియున్నారు.

కావున అందరికీ తెలియజేయునది ఏమనగా ఎవరికైనా ఎటువంటి హక్కు కాని, హక్కు అభ్యంతరములు సదరు ఆస్థిపై ఉన్న ఎడల వారు వారికి ఉన్నటువంటి కాగితములు ద్వారా వారికి ఉన్నటువంటి కాగితముల రుజువుతో ఈ నోటీసు ముద్రించిన వారం రోజులలోగా తెలియజేయవలెను. లేనిఎడల ఎటువంటి క్లయిమ్స్ కాని, అభ్యంతరములు కాని లేవని గమనించబడును మరియు తదుపరి వ్యవహారము జరిపించబడును.

డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు సబ్ రిజిష్టరు, రాజోలు మండలం,కడలి గ్రామ పంచాయితీ కడలి గ్రామం, గ్రామ కంఠం సర్వే నెం. 704/1, ఈశాన్యం మూల 0-04 1/2 అలాగె 218 చ॥గ॥ (ప్రస్తుతం ఆర్.సి.సి. బిల్డింగు నిర్మాణం జరుగుచున్నది. 0-01 సెంట్లు భూమి దారి మార్గం కొరకు వదిలిపెట్టబడింది) 0-16 1/2 సెంట్లులో గల 14-56 సెంట్లులో గల ఆస్తి. ***తూర్పు:*** 13 అడుగుల దారి మార్గం - 71 లింకులు. ***పడమర:*** కాదంబరి సూర్య భాస్కర్ గారి స్థలం -68 లింకులు. ***దక్షిణం:*** దూది ఆదినారాయణ గారి స్థలం -66 లింకులు. ***ఉత్తరం:*** రోడ్డు - 65 లింకులు.
(యావత్తు ఈజుమెంటు హక్కులతో సహా)

టి.శాంతి కమల, అడ్వకేట్,
అమలాపురం. సెల్: 98665 45823